సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం ၊ 10 ၊ అక్టోబర్ ၊ 2025

I



వైద్యం ప్రజల హక్కు

మెరుగైన వైద్య సేవలు పొందడం ప్రజల ప్రాథమిక హక్కు అని, దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని మాజీ శాసన మండలి సభ్యుడు గేయానంద్ అన్నారు. - IIలో



కూటమి నేతలకు తొత్తులుగా విజిలెన్స్ అధికారులు

కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కడప విజిలెన్స్ అధికారులు 6ఏ కేసులు నమోదు చేస్తున్నారని, పలువురు డీలర్లు వాపోతున్నారు. - IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.230
రెండోరకం	రూ.130	రూ.180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 170 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	311	625
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 213.760 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్ : అర్హులైన నిరుద్యోగ మైనార్టీ యువతకు హోం కేర్ నర్స్ ఉద్యోగాల కోసం ఓవర్సీస్ మెన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ద్వారా ఖతర్ దోహాలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ విషయాన్ని అన్నమయ్య, వైఎస్ఆర్ కడప జిల్లా ఏపీ స్టేట్ మైనార్టీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షేక్ హిదాయతుల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (నర్సింగ్), జీఎన్ఎం (నర్సింగ్) అర్హత కలిగి 21–40 సంవత్సరాలు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు 2 సంవత్సరాలు అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 12వ తేదీన విజయవాడలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08562–241137, 9290448452, 9515835805 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆలయ భూముల ఆక్రమణలపై చర్యలు



ఆక్రమణ భూమిని పరిశీలిస్తున్న విశ్వనాథం

సుండుపల్లె : మండల పరిధిలో ఆలయ భూములు ఆక్రమణకు గురైతే స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపడుతున్నట్లు దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథం తెలిపారు. సుండుపల్లెకు సమీపంలో రెవెన్యూ ఆర్ఎస్ఆర్, దేవదాయ శాఖ రికార్డుల ప్రకారం 2127 సర్వే నంబర్‌లో సుండుపల్లెమ్మ దేవతకు చెందిన ఆక్రమణలకు గురైన 4.40 ఎకరాల మాన్యం భూములను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 59 మందికి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథం తెలిపారు. గురువారం మండలంలోని పలు ఆలయాలను పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పూజలు, దూప దీప నైవేద్యాల గురించి అర్చకులను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

రాయచోటి : ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నిశాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్‌లు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మూడంచెల గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. డీఆర్ఓ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

దోచుకోవడమే లక్ష్యంగా పాలన

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం
- రచ్చబండకు కార్యకర్తలు సిద్ధం కావాలి
- గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి





సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.చిత్రంలో ఆకేపాటి అమరనాథరెడ్డి, సురేష్‌బాబు తదితరులు

రాజంపేట : రాష్ట్రంలో దోచుకోవడమే లక్ష్యంగా కూటమి పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు.గురువారం రాజంపేట మండలం ఆకేపాడు ప్రాంతం పరిధిలో ఉన్న ఆకేపాటి ఎస్టేట్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కార్యకర్తల ద్వారానే పాలన కొనసాగుతుందని భరోసా ఇచ్చారు. గ్రామ కమిటీ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతం దిశగా వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే గ్రామ,మండల, జిల్లా స్థాయి కమిటీల నియామకం పూర్తిచేసి, బలోపేతం దిశగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ సైన్యాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని అన్ని నియోజకవర్గాలల్లో పార్టీ కమిటీలను పూర్తి చేసి, ముందంజలో ఉందన్నారు. ఎల్లో మీడియా అబద్ధాలు ప్రచారం చేస్తోందని, అవి నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సాయం అందించేందుకు 2లక్షల 59వేల కోట్లు వ్యయం చేసినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇప్పుడు అవినీతి ప్రభుత్వం రాజ్యమేలుతోందన్నారు. కల్తీమద్యం వ్యవహారాన్ని కప్పిపుచ్చుకునేందుకు, వైఎస్సార్‌సీపీకి అంటగట్టేందుకు ఎల్లోమీడియా అష్టకష్టాలు పడుతోందని, అయితే కల్తీమద్యం టీడీపీదేనని ప్రజలందరూ బహిరంగంగానే అంటున్నారని అన్నారు. కల్తీమద్యం కేసుకు కీలక సూత్రధారి సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి రూ.50కోట్లు, టికెట్‌కు రూ.50కోట్లు ఇచ్చుకొని పోటీ చేశారని, అటువంటి వ్యక్తితో వైఎస్సార్‌సీపీకి మరక అంటించేలా రాసేందుకు ఎల్లో మీడియాకు సిగ్గుండాలని దుయ్యబట్టారు. రాష్ట్రమంతటా మద్యం అక్రమడంప్‌లు బయటపడుతున్నాయన్నారు.. ముఖ్యమంత్రి, ఆయన తనయుడికి తెలియకుండా అక్రమమద్యం వ్యహారం నడవలేదని ప్రజలు గుర్తించారన్నారు. దిగజారుడు ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు నడిపిస్తున్నాడని విమర్శించారు. సమావేశం ప్రారంభంలో ఎమ్మెల్యే ఆకేపాటి మనవడు ఆకేపాటి హేమరాఘవరెడ్డి స్వాగతం ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలాశ్రీనివాసుల రెడ్డి, ఫయాజ్‌బాషా, వనజారెడ్డి, ఎంపీపీలు మేడా భాస్కరరెడ్డి, గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీనేతలు గాలివీటి భాస్కర్‌రెడ్డి,గాలివీటి వీరనాగిరెడ్డి, చొప్పాఎల్లారెడ్డి, టక్కోలు శివారెడ్డి,తల్లెంభరత్‌రెడ్డి,ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, విజయకుమారెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి, పాలగిరిసుధాకర్‌రెడ్డి, నడివీధిసుధాకర్, యదుభూషణరెడ్డి, శిబ్యాలవిజయభాస్కర్, భాస్కర్‌రాజు, రామనాథం, దాసరి పెంచలయ్య,పొత్తపి చంద్ర, గాలివీటి ప్రవీణ్‌రెడ్డి, సుగవాసిశ్యామ్, వైఎస్సార్‌సీపీ మహిళ వివిధ స్థాయి నేతలు ఏకులరాజేశ్వరీరెడ్డి, షమీమ్‌అస్లాం, బీరంగ రేవతి, మహితా, అజంతమ్మ, మల్లీశ్వరి, అజంతమ్మ, ఎంపీపీ రమణమ్మయాదవ్,మిరియాల సురేఖ,మైనార్టీ నేతలు హరున్‌బాషా, రియాజ్ అహమ్మద్, ముస్తాక్, కలీం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, రాజంపేట, ఒంటిమిట్ట, సుండుపల్లె, వీరబల్లి, సిద్ధవటం మండలాలకు చెందిన వివిధ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న విజన్...

జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జగనన్న విజన్‌ను వీడియో వైవా ద్వారా నిర్వహక ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి నిర్వహించారు. పార్టీ కమిటీ నిర్మాణంతోపాటు బలోపేత దిశగా చేపట్టాల్సిన నియమ నిబంధనలు పార్టీ క్యాడర్‌కు వివరించారు.

పార్టీ పటిష్టతకు కృషిచేయాలి



వైఎస్సార్‌సీపీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలి. వైఎస్ జగన్ ఆదేశం మేరకు డిసెంబరులోపు పార్టీకి సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తిచేయాలి. 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలే ప్రధానభూమిక పోషించాలి.

– మేడా రఘునాథరెడ్డి, ఎంపీ, రాజ్యసభ

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అన్ని స్థాయి కమిటీలను పూర్తి చేశాం. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించాం. ప్రజావ్యతిరేక నిర్ణయాలను ఎప్పటికప్పుడు ఎండగట్టే విధంగా పార్టీని సంసిద్ధం చేస్తున్నాము. 2029లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశగా ఇప్పటి నుంచి పార్టీ క్యాడర్ సమాయత్తంకావాలి

– ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు,ఎమ్మెల్యే

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కూటమి వైఫల్యాలపై శంఖానాదం పూరించాలి. రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేసే దిశగా అడగులు వేయాల్సి ఉంది. పుంగనూరు నియోజకవర్గంలో 14వేలమందితో పార్టీ కమిటీల నియామకం పూర్తిచేయడం అభినందనీయం.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

తప్పుడుకేసులను తిప్పికొడతాం



వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడితే తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నాం. అక్టోబరులో అమెరికాకు ఐకాస సమావేశానికి వెళ్లే బృందంలో ఎంపీ మిధున్‌రెడ్డిని ప్రధాని మోదీ ఎంపిక చేయడం గర్వకారణం. మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా బయటికివచ్చారు. అందరి భాగస్వామంతో పార్టీ పటిష్టతకు కృషిచేయాలి.

– కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

పతనం అంచులో టీడీపీ ప్రభుత్వం



16 నెలలో అవినీతి, అక్రమాలు, అక్రమకేసుల తప్ప మరొకటి లేదు. ప్రజావ్యతిరేక నిర్ణయాలతో పరిపాలన సాగుతోంది.ఇప్పుడు పతనం అంచులో టీడీపీ ప్రభుత్వం కొనసాగుతోంది. కల్తీమద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ,మహిళాపై అఘాయిత్యాలు లాంటి సంఘటనలతో సీఎం సిగ్గుతో తలదించుకోవాలి.

– చింతలరామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పీలేరు

డైవర్షన్ పాలిటిక్స్‌లో దిట్ట చంద్రబాబు



సీఎం చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్‌లో దిట్ట.ఇందులో సందేహం లేదు. సరైన సమయంలో ఓటు అనే ఆయుధంతో సమాధానం చెప్పేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమలు కాదు, మద్యం పరిశ్రమలు వెలుస్తున్నాయి.రాష్ట్రమంతటా నకిలీమద్యం సరఫరా అవుతోంది. నకిలీ మద్యం స్కాంపై విచారణ జరపాలి. సంపద సృష్టిస్తామని చెపుతూ తమ సంపదను పెంచుకుంటున్నారు. రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ సైన్యం సిద్ధం కావాలి.

– నిసార్ అహమ్మద్, ఇన్‌చార్జి, మదనపల్లె

అవినీతి రాజ్యమేలుతోంది



కూటమి పాలనలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. తప్పుడుకేసులు, తప్పుడు నిర్ణయాలతో ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు.ఇప్పుడు రాష్ట్రంలో సుపరిపాలనకాదు, అక్రమమద్యం మత్తులో పాలన కొనసాగుతోంది.కార్యకర్తలు సైన్యంలా పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

– సురేష్‌బాబు, జిల్లా పరిశీలకులు, వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్‌సీపీ సైన్యం రెడీ



వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉంది. గ్రామ స్థాయి నుంచి రూ.18లక్షల సైన్యం రెడీ అవుతోంది. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కలిసికట్టుగా కృషి చేయాలి. కూటమి ప్రభుత్వ బెదింపులకు భయపడే వారు వైఎస్సార్‌సీపీలో లేరని తెలసుకోవాలి.

– రెడ్డప్పగారి రమేష్‌రెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి,

అక్రమాలకు నిలయం టీడీపీ ప్రభుత్వం



అవినీతి, అక్రమాలు టీడీపీ ప్రభుత్వం నిలయంగా మారింది. కల్తీ మద్యం రాష్ట్రమంతటా కంపు కొడుతోంది. కూటమి ప్రభుత్వం ప్రజల్లో అభాసుపాలైంది.అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నడుం బిగించక తప్పదు.

– సుగవాసి బాలసుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ కేంద్రకమిటీ సభ్యుడు

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాయచోటి జగదాంబసెంటర్ : పొగాకు రహిత సమాజాన్ని నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జాతీయ పొగాకు నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి కోరారు. గురువారం రాయచోటిలోని డైట్ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ సిగరెట్లు, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని, పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న వారిచేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎం.నర్సింహారెడ్డి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు శివభాస్కర్, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీవాణి తదితరులు

మద్యంలో 25 శాతం నకిలీదే

- నకిలీ మద్యం నిందితుడు నా కోవర్టు అయితే మీరెందుకు పట్టుకోలేకపోయారు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యంలో 25 శాతం నకిలీదేనని, ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి నకిలీదని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం కడపలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి ఓట్లేసిన పాపానికి ఎరువులు, విత్తనాలు లేక రైతులు బాధపడుతున్నారన్నారు. పత్తి, ఉల్లి, మిర్చి, టమోటా, దోస, మామిడి రైతులు నిండా మునిగిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు ఇచ్చేవారమన్నారు. ఇప్పుడు వర్షాలు బాగా పడినా, రైతులెవరూ భూముల్లో పనిచేసే పరిస్థితి లేదని, అందరూ అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. రాష్ట్రంలో పచ్చమీడియా ఒక మాఫియాగా తయారైందని, వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నన్ని రోజులు వైఎస్ జగన్‌ను అవినీతిపరుడిగా చిత్రీకరించిన పచ్చమీడియా, కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం చేసే తప్పులు దాచిపెట్టి, మూసిపెట్టి చంద్రబాబును ఆకాశానికి ఎత్తేస్తోందన్నారు. తంబళ్లపల్లెలో లక్షలాది నకిలీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయన్నారు. ఇంత జరుగుతున్నా డీఫ్యాక్ట్ సీఎం లోకేష్‌కు, ఇంటెలిజెన్స్, పోలీసు, ఎక్సైజ్ వారికి తెలియకపోవడం హాస్యాస్పదమన్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడిందని, తనిఖీల్లో దొరికిన బాటిళ్ల లేబుళ్లన్నీ ఇతర రాష్ట్రాలకు చెందినవని, ఇతర రాష్ట్రాల వారే దీన్ని బయటపెట్టారన్నారు. నెల్లూరు, ఒంగోలు, క్రిష్టా, ఇబ్రహీం పట్నం, ఏలూరు, అనకాపల్లి ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు బయటపడ్డాయన్నారు. వాటికి సారథ్యం వహించేవారంతా చినబాబు సన్నిహితులేనని ఆరోపించారు. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి తన కోవర్టు అయితే రూ.50కోట్లు తీసుకొని టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆయన మరో రూ.50 కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేశారని, తన కోవర్టు అయితే ఇంతకాలం వారు ఎందుకు పట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు.

వర్షాన్ని కూడా లెక్కచేయని ప్రజాభిమానం

నర్సీపట్నంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు అద్భుత స్పందన వచ్చిందని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా లక్ష మంది జనం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. వైఎస్ జగన్ పర్యటనకు పోలీసులు అనేక అడ్డంకులు సృష్టించారని, క్రికెట్ మ్యాచ్ ఉందని విశాఖ కమిషనర్ చెబితే, 37 కి.మీ తిరిగి పోవాలని మరో ఎస్పీ చెప్పారన్నారు. టీడీపీ ప్రాబల్యం ఉన్న చోట ప్రజలు వీటన్నింటినీ లెక్కచేయకుండా తండోపతండాలుగా తరలి వచ్చి తమ అభిమానాన్ని చూపారన్నారు.

సాగుకు వేళాయె..రాయితీ విత్తనం రాకపాయె

ఉలవల కోసం రైతుల ఎదురుచూపులు

- ప్రత్యామ్నాయ వంటల సాగుకు సన్నద్ధం!
- జిల్లాలో17256 ఎకరాల్లో ఉలవ సాగు



ప్రత్యామ్నాయం పంటల సాగు కోసం పొలంలో దుక్కులు చేస్తున్న రైతు

గుర్రంకొండ : జిల్లాలో ఉలవ పంట సాగుకు అదను దాటుతుండడంతో రైతులు ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ ఉలవల కోసం ఎదురుచూస్తున్నారు. సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలలు ఉలవ పంట సాగుకు అనుకూలం. గత ఏడాది ప్రభుత్వం సబ్సిడీ ఉలవలను సెప్టెంబర్‌నెలలోనే పంపిణీ చేసింది. ఈ సంవత్సరం ఇంతవరకు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వర్షాధారమైన ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.ముఖ్యంగా ఉలవపంట సాగుకు ఇదేఅదను కావడంతో ప్రభుత్వం పంపిణీ చేసే ఉలవల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 17256 ఎకరాల విస్తీర్ణంలో ఉలవ పంట సాగుకు రైతులు సన్నాహాలు చేసుకొంటున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌సీజన్ వేరుశగపంట సాగు గడవు ముగిసింది. సాధారణంగా వర్షాలు సమృద్ధిగా కురిసే జూన్, జులై, ఆగష్టు నెలల్లో మాత్రమే వేరుశనగ సాగుకు అనుకూలం. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవలేదు. దీంతో వేరుశనగ సాగు అనుకున్న విధంగా సాగలేదు. జిల్లాలో సగటున నుంచి 24 శాతం మంది రైతులు మాత్రమే ఈసీజన్‌లో వేరుశగ సాగు చేశారు. గడువు ముగిసి పోవడంతో మిగిలిన రైతులు ప్రత్యామ్నాయ పంటలు, అందులోనూ ఉలవపంట సాగుకు సన్నద్ధమవుతున్నారు.

ఉలవ పంట సెప్టెంబరు నుంచి అక్టోబర్ 30 వరకు సాగు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో వేరుశనపోను మిగిలిన 17256 ఎకరాల్లో రైతులు ఉలవ సాగు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తే ఉలవ పంట సాగు చేసుకోవచ్చని రైతులు అంటున్నారు.

అన్నదాతకు అవసరమైన ఉలవల స్టాకు కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి స్టాకు రాగానే పంపిణీ చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

ఉలవపంట సాగు విస్తీర్ణం వివరాలు

నియోజకవర్గం పేరు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
1) పీలేరు	4520
2)తంబళ్లపల్లె	4635
3) మదనపల్లె	3850
4) రాయచోటి	4251

గతేడాది సెప్టెంబర్‌లోనే పంపిణీ

సాధారణంగా జిల్లాలోని రైతులు వేరుశనగ పంట సీజన్ ముగియగానే ఉలవ సాగు చేయడానికి ఏర్పాట్లు చేసుకొంటారు. సాగును సెప్టెంబర్‌నెలలోనే ప్రారంభించడం ఆనవాయితీ. గత ఏడాది రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సెప్టెంబర్ మొదటి వారంలోనే జిల్లాలోని రైతుసేవాకేంద్రాల ద్వారా సబ్సిడీపై ఉలవలను పంపిణీ చేశారు. ఈ సంవత్సరం ఇంతవరకు ఇవ్వలేదు. రైతులు ప్రతిరోజు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది వద్దకు వెళ్లి వాకబు చేస్తున్నారు. అయితే సబ్సిడీ ఉలవల పంపిణీపై వారికే సరైన అవగాహన లేకపోవడం రైతులకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు.

ఉలవలు పంపిణీ చేయాలి



జూన్, జులై,ఆగస్టు నెలల్లో మాత్రమే వేరుశనగ సాగు చేసుకోవాల్సి ఉంటుంది. ఈఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. పంటసాగు గడువు ముగిసింది. ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ సాగు చేసుకోవడానికి ఇదే అదను. మరోసారి దుక్కులు చేసుకొని పంట సాగు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాం.ఉలవలు పంపిణీ చేయాలి.

– లక్ష్మీదేవి, గుట్టకిందపల్లె

వేరుశనగ సీజన్ ముగిసింది



వేరుశెనగ పంట సాగు గడువు ముగిసింది. ప్రత్యామ్నాయంగా ఉలవ పంటను సాగు చేసుకుంటాం. గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో రైతులకు ఉలవలను సబ్సిడీపై ఇచ్చారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెల ముగిసినా ఇవ్వలేదు. ఇప్పుడు కురుస్తున్న చెదురుమొదురు వర్షాలకు ఉలవ పంట సాగు చేసుకోవచ్చు. త్వరగా ఉలవలు అందజేయాలి

– నరసింహులు, కొత్తపల్లె


ప్రతిపాదనలు పంపాం



ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అవసరమైన ఉలవలను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయడం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారం రోజుల్లోగా ఆర్ఎస్‌కేలు చేరుతాయనే సమాచారం ఉంది. ప్రభుత్వం నుంచి స్టాకు రాగానే రైతులకు పంపిణీ చేస్తాం.

– రత్నమ్మ, ఏవో, గుర్రంకొండ.

నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరణ



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖలు విద్యారంగంలో అవలంబిస్తున్న ప్రయోగాలను, తిరోగమన విధానాలను వ్యతిరేకిస్తూ పాఠశాలల్లో ఈనెల 10వ తేదీ నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించనున్నారు. ఈ మేరకు ఫ్యాప్టో నిర్ణయం తీసుకుంది. ఈ నెల 7వ తేదీ విజయవాడలో జరిగిన ఫ్యాప్టో రాష్ట్రకార్యవర్గంలో తీసుకున్న నిర్ణయాన్ని శుక్రవారం నుంచి అమలుకు శ్రీకారం చుడుతున్నారు.ఈ మేరకు గురువారం ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.బోధనేతర కార్యక్రమాలు వల్ల బోధనా సమయం హరించుకుపోతోందని, ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోయేలా చేస్తోందని పేర్కొన్నారు. కావున ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జాబిర్, జనరల్ సెక్రటరీ గఫార్ ఖాన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారన్నారు. మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప బోధనేతర పనులను, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమని తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కో–చైర్మన్‌లు శివారెడ్డి, సిబాతుర్రహ్మాన్, పి మహమ్మద్ ఇలియాస్, కోశాధికారి జాఫరుద్దీన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ హరిబాబు, ఫ్యాప్టో నాయకులు సురేంద్రరెడ్డి, టి శివారెడ్డి, రెడ్డయ్య, దావుద్దీన్, అంజద్‌బాషా శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్థలం కోసం ఇరువర్గాల ఘర్షణ



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

సిద్దవటం : స్థల వివాదం విషయంలో ఘర్షణ వాతావరణం ఏర్పడి ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకోవడంతో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులకు గాయాలయ్యాయి. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామం రోడ్ నెంబర్ 1 పెద్దపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 87/2లో 20 సెంట్ల స్థలంలో మాధవరం గ్రామానికి చెందిన విజయ్ అనే వ్యక్తి గురువారం గృహ నిర్మాణం పనులు చేపట్టారు. అయితే ఆ స్థలం తనదని గాలి సుబ్రమణ్యం మరికొంత మంది నిర్మాణ పనులకు అడ్డు తగిలారు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ఈ ఘర్షణలో విజయ్ అనే వ్యక్తి తలకు బలమైన గాయాలు తగలడంతో కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు, వీఆర్‌ఓ రేణుక సంఘటన స్థలానికి చేరుకుని గృహ నిర్మాణ పనులు నిలుపుదల చేయించారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన విద్యార్థి ప్రదీప్

మదనపల్లె రూరల్ : బాత్రూమ్‌లో జారిపడి విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది.

దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లెకు చెందిన మల్లికార్జున, గంగాదేవి దంపతుల కుమారుడు ప్రదీప్(9) స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఉదయం విరామ సమయంలో బాత్రూమ్‌కు వెళ్లాడు. అదే సమయంలో బయట గుడివద్ద మేళతాళాల శబ్దం రావడంతో ఊరేగింపు చూసేందుకు బాత్‌రూమ్‌లోని గోడకు అమర్చిన పలకలపై ఎక్కి చూసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గోడ పలక విరిగిపోవడంతో జారి కిందపడ్డాడు. కిందపడే సమయంలో పలకకు అమర్చిన టైల్స్ మొన పదునుగా ఉండటంతో కడుపులో గుచ్చుకుని తీవ్రంగా గాయపడ్డాడు. పొట్ట పేగులు సైతం బయటకు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు బాలుడిని హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

కూటమి నేతలకు తొత్తులుగా విజిలెన్స్ అధికారులు

- కోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల షాపులపై 6ఏ కేసులు నమోదు
- ఎలాంటి ఆథరైజేషన్ లేకుండానే టీడీపీ నేతల ఇళ్లల్లో సరుకును అప్పగించిన రెవెన్యూ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రేషన్ డీలర్లపై కడప విజిలెన్సు అధికారులు 6ఏ కేసులు నమోదు చేస్తున్నారని, సంబంధిత డీలర్లను పరుషపదజాలంతో విజిలెన్సు సీఐ నారాయణరావు బూతులు మాట్లాడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని పలువురు డీలర్లు వాపోతున్నారు. గురువారం మండలంలోని దిన్నెపాడు గ్రామం, నరసింహరాజుగారిపల్లికి చెందిన చౌక దుకాణం 1136007 రేషన్ షాపు తనిఖీకి వచ్చిన విజిలెన్సు సీఐ నారాయణరావు తనిఖీల్లో ఎలాంటి వ్యత్యాసం లేకున్నా తనకు ఇష్టం వచ్చినట్లు కేసు రాశారని సంబంధిత డీలర్ నాగరాజు వాపోయారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం దుకాణంలో డీలర్ అందుబాటులో లేని విషయాన్ని గుర్తించిన గ్రామంలోని కొందరు కూటమి నేతలు రేషన్ దుకాణం ఇంటి పైన వెలుతురు కోసం ఏర్పాటు చేసుకున్న రంధ్రం ద్వారా కొంతమేర బియ్యాన్ని కిందకు పోశారని.. ఆ తర్వాత గ్రామానికి కూతవేటు దూరంలో అందుబాటులో ఉన్న విజిలెన్సు వారికి సమాచారాన్ని అందజేసి హుటాహుటిన రేషన్ దుకాణంలోకి చొరబడి తాళాలు తెరిపించి ఉన్న స్టాకును సీఐ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఇంటిపైన ఉన్న రంధ్రం నుంచి కూటమి పార్టీకి చెందిన కొందరు రేషన్ దుకాణంలోకి కొంతమేర బియ్యాన్ని పోసిన విషయాన్ని విజిలెన్సు సీఐ నారాయణరావుతోపాటు సంబంధిత తహసీల్దార్ క్రాంతి కుమార్, ఆర్ఐ రాజేష్, సిబ్బందికి ప్రత్యక్షంగా చూపించినప్పటికీ అవన్నీ సంబంధం లేదు స్టాక్ ఉన్నంత మేరకే తాము లెక్కించి కేసు నమోదు చేస్తామని చెప్పారని వారు వాపోయారు. అక్కడ నిల్వ ఉన్న ఏడు క్వింటాళ్ళ, 90 కేజీల బియ్యానికి ఎలాంటి అధికారిక అనుమతి లేకపోయినా తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి ఇంటికి సరుకును అప్పగించి వెళ్లినట్లు డీలరు నాగరాజు తెలిపారు. అనంతరం దప్పేపల్లి గ్రామం, గొల్లపల్లిలోని చౌక దుకాణం 1136016కు చెందిన బాలే పెద్ద ఓబులేశు దుకాణాన్ని తనిఖీ చేసి ఎలాంటి వ్యత్యాసం లేకపోయినా ఆథరైజేషన్ లేదనే నెపంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలంలో ఏ ఒక్క డీలర్‌కు కూడా నాలుగేళ్లుగా ఆథరైజేషన్ లేదనే విషయం సంబంధిత డీలర్ ఓబులేశు విజిలెన్సు సీఐ ఎదుట ప్రస్తావించగా వినకపోవడంతో చేసేదేమీలేక మిన్నకుండిపోయామన్నారు. ఇదే మండలంలో గత నెలలో తనిఖీకి వచ్చిన విజిలెన్స్ సీఐ నారాయణరావు వరుసగా మూడు రేషన్ దుకాణాలు తనిఖీ చేసి డీలర్లపై నోరుపారేసుకున్నారన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా కూడా తప్పుడు కేసులు బనాయిస్తూ కూటమి నేతలకు రెవెన్యూ సిబ్బంది పర్మినెంటు రేషన్ డీలర్ల సరుకును అప్పగించడంపై పలువురు మండిపడుతున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తొత్తులుగా మారిన విజిలెన్సు సీఐ నారాయణరావు, రెవెన్యూ సిబ్బందిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తామని పలువురు డీలర్లు పేర్కొంటున్నారు.



దిన్నెపాడు నరసింహరాజుగారిపల్లిలోని చౌక దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

రేషన్ షాప్ మిద్దెపై నుంచి బియ్యం పోశారు..



మేము ఇంటివద్దలేని సమయంలో మా పల్లెలోని కొందరు తెలుగుదేశం పార్టీకి చెందిన వారు మా మిద్దెపై ఉన్న గవాచీ ద్వారా కొంత బియ్యాన్ని గుమ్మరించారు. ఐదు నిమిషాలలోపే విజిలెన్సు సీఐ నారాయణ రావు తన బృందంతో వచ్చి స్టాకును స్వాధీనం చేసుకున్నారు. గవాచి ద్వారా పోసిన బియ్యాన్ని విజిలెన్సు అధికారులతోపాటు రెవెన్యూ సిబ్బందికి చూపించినా కూడా వినకుండా 70 కేజీలు అదనంగా ఉన్నట్లు చూపిస్తూ నా షాపుపై 6ఏ కేసు నమోదు చేశారు.

నాగరాజు, నరసింహరాజుగారిపల్లి,
ప్రభుత్వ చౌకదుకాణం డీలర్, లక్కిరెడ్డిపల్లి మండలం

ఆథరైజేషన్ లేదని 6ఏ కేసు రాశారు..



నా రేషన్ షాప్ తనిఖీకి వచ్చిన విజిలెన్సు సీఐ నారాయణరావు ఎలాంటి వ్యత్యాసాలు లేకపోయినా కేవలం ఆథరైజేషన్ లేదనే కారణం చూపిస్తూ 6ఏ కేసు నమోదు చేశారు. లక్కిరెడ్డిపల్లి మండలంలో ఒక్క షాపునకు కూడా నాలుగేళ్లుగా ఆథరైజేషన్ లేదనే విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పరిగణనలోకి తీసుకోలేదు. తెలుగుదేశం వారికి తొత్తులుగా మారి ఉద్యోగం చేస్తూ ఏ తప్పు లేకపోయినా కేసులు నమోదు చేస్తున్నారు.

బాలేపెద్ద ఓబులేశు, గొల్లపల్లి, దప్పేపల్లి గ్రామం,
లక్కిరెడ్డిపల్లి మండలం

నిమ్మతోట బాధితులకు అండగా ఉంటాం



నిమ్మతోట బాధితులకు భరోసా ఇస్తున్న ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొనరాజుపల్లిలో ఈనెల 7వ తేదీ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన అప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అప్పిరెడ్డి సుబ్బారెడ్డి నిమ్మతోటను టీటీడీ మూకలు దున్నేసిన ఘటనపై గురువారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఎంపీ మేడా రఘునాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యను విన్న ఎంపీ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ అమాయకులైన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను కూటమి నాయకులు లక్ష్యంగా చేసుకున్నారన్నారు. అధికారంలో కూటమి ప్రభుత్వం ఉందని, ఏమి చేసినా మమ్మల్ని ఎవ్వడు ఏమీ చేయలేడనే అహంకారంతో టీడీపీ మూకలు రెచ్చిపోతున్నాయన్నారు. అందులో భాగమే అప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నిమ్మతోట దున్నేయడం అన్నారు. ఇలాంటి వారికి చట్టప్రకారం శిక్ష పడేలా చేస్తాం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకపాటి నందకిశోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం ప్రజల హక్కు

- అమలు బాధ్యత ప్రభుత్వానిదే
- మెడికల్ కళాశాల పరిరక్షణకు ప్రజా ఉద్యమం

మదనపల్లె : మెరుగైన వైద్య సేవలు పొందడం ప్రజల ప్రాథమిక హక్కు, దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని మాజీ శాసన మండలి సభ్యుడు డాక్టర్ యం.గేయానంద్ అన్నారు. ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక, ప్రజారోగ్య వేదిక, భారత విద్యార్థి ఫెడరేషన్ సంయుక్త నిర్వహణలో మదనపల్లె పట్టణంలో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో గురువారం సమావేశం జరిగింది. గేయానంద్ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో పీపీపీ అమలు చేయడం ప్రమాదకరమన్నారు. ప్రభుత్వం తన బాధ్యతగా ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలో 10 వైద్య కళాశాలలను పీపీపీ ద్వారా ప్రైవేట్‌కు అప్పగించడం ప్రజావ్యతిరేక చర్య అన్నారు. ఈ విధానం వల్ల ఏటా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు వెయ్యి సీట్లు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ఆరోగ్యవేదిక అధ్యక్షుడు ఎంవి రమణయ్య మాట్లాడుతూ ఆస్పత్రులు కూడా ప్రైవేటీకరణ అవుతాయన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని కోరుతూ ఈ నెల 27న మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ప్రవేశపెట్టిన తీర్మానానికి సదస్సు ఆమోదం తెలిపింది.

వీసీకే పార్టీ రాష్ట్ర నాయకుడు పీటీఎం శివ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే 300 పడకల ఆస్పత్రితోనే పేద రోగులకు వైద్యసేవలు అందుతాయన్నారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్డి సాహెబ్, జనవిజ్ఞాన వేదిక నాయకుడు టి.హరీంద్రనాథ్ శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో కవి పోతబోలు రెడ్డెప్ప, సీఐటీయూ నాయకుడు ప్రభాకర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆఫ్రిద్, షామీర్, ఐద్వా నాయకులు భాగ్యమ్మ, రెడ్డి ప్రసన్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, మధురవాణి, ఆశా కార్యకర్తల సంఘం నాయకులు మల్లీశ్వరి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న గేయానంద్

విద్యార్థులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ పై బుధవారం రాత్రి జరిగిన ఘటనపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ గోపాల్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. ములకలచెరువు మండలం దేవలచెరువు పంచాయతీ, పర్తికోటకు చెందిన మాదాసి వివేక్ (20) చిత్తూరు జిల్లా పలమనేరులోని మదర్ థెరిసా కాలేజీలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. గుండుబావి వద్ద గదిని అద్దెకు తీసుకుని సహ విద్యార్థి గణేష్ తో కలిసి ఉండేవాడు. వీరితోపాటు వంశీ స్నేహితులు, ఒకే తరగతి చదువుతున్నారు. ఇటీవల వివేక్ విడిగా గది తీసుకుని మిత్రులను రానివ్వకుండా ఒక్కడే ఉంటున్నాడు. గణేష్ స్నేహితుడైన వంశీకి లేనిపోని మాటలు చెబుతున్నాడని వారి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో బుధవారం వంశీ తన స్నేహితుడి పుట్టినరోజు ఉన్నదని హార్సిలీ హిల్స్‌పై విందు కార్యక్రమం ఉందని పిలవగా వివేక్ వెంట వచ్చాడు. వంశీ, అతని స్నేహితులు కొందరు, వివేక్ కలిసి కొండపై రెండు గదులు తీసుకొన్నారు. ఈ సందర్భంగా గణేష్ గురించి మాట్లాడుతూ ఉండగా వంశీ స్నేహితులైన లోకేష్ యశ్వంత్ ముగ్గురూ కలిసి వివేక్‌ని కులం పేరుతో దూషించి అక్కడే ఉన్న మద్యం బాటిల్‌తో కొట్టడంతో తీవ్ర గాయమైంది. బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. వివేక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుడి అరెస్టు

ములకలచెరువు : మండలంలోని కాలువపల్లి పంచాయతీ బుద్దలవారిపల్లిలో బెల్ట్ షాపు పైన గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకుడు బోరెడ్డి చంద్రారెడ్డిని అరెస్టు చేసి 51 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : అన్నమయ్య జిల్లా పుల్లంపేట సమీపంలో 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. బుధవారం అన్నమయ్య జిల్లా పుల్లంపేటలో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. అక్కడ ఏం.బావి ఫారెస్టు బీటు పరిధిలోని రెడ్డిపల్లి చెరువు కట్టవద్ద ఒక వ్యక్తి కనిపించాడు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. విచారణలో పొదల్లో దాచిన ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటిలో పాతవి 6 దుంగలు ఉండగా, మూడు కొత్తవి ఉన్నాయి. దుంగలతో సహా వ్యక్తిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్‌లు విచారణ అనంతరం సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సుండుపల్లె : మండల పరిధిలోని రాచంవాండ్లపల్లిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి జయన్న అనే వ్యక్తి దగ్గర నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. ఇంకా పలు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇంటి తాళాలు పగలగొట్టి కబ్జాకు యత్నం

మదనపల్లె రూరల్ : కోర్టు కేసులో ఉన్న ఓ ఇంటి తాళాలు పగలగొట్టి, కబ్జాకు యత్నించిన ఘటన బుధవారం రాత్రి పట్టణంలో జరిగింది. పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్ సుబ్బారెడ్డి లేఅవుట్‌లో ఇంటినెంబర్.17/185ఈ-2-3కు సంబంధించి, మదనపల్లె సెకండ్ ఏడీజే కోర్టులో 2011 నుంచి చలపతి, ప్రతివాదులైన దేవప్రకాష్, రవికుమార్ మధ్య కేసు నడుస్తోంది. ఇదే ఇంటిని తాను కొనుగోలు చేశానని, స్వాధీనం చేయాల్సిందిగా పట్టణానికి చెందిన జరీనా అనే మహిళ చలపతి, దేవప్రకాష్, రవికుమార్, గంగరాజులపై 2024లో మరో కేసు వేసింది. ఇల్లు 17 ఏళ్లుగా దేవప్రకాష్, రవికుమార్ స్వాధీన అనుభవంలో ఉంది. ఇంట్లో 8 ఏళ్లుగా అద్దెకు ఉంటున్న గంగరాజు, సొంత ఇల్లు నిర్మించుకుని, ఈనెల 2వ తేదీ ఇల్లు ఖాళీ చేసి, తాళాలను యజమాని దేవప్రకాష్‌కు అప్పగించారు. ఇల్లు ఖాళీ అయిన విషయం తెలుసుకున్న జరీనా మనుషులు.. వారికి సంబంధం లేకపోయినా ఇంటిని తమకు అప్పగించాలని, లేకుంటే కూల్చేస్తామని దేవప్రకాష్‌ను బెదిరించారు. తర్వాత రెండురోజుల అనంతరం మరోసారి బుధవారం రాత్రి 8.30 గంటలకు, దౌర్జన్యంగా ఇంటికి వేసిన తాళం పగలగొట్టి కబ్జాకు యత్నించారు. విషయం తెలుసుకున్న బాధితుడు దేవప్రకాష్..112 నెంబర్‌కు ఫోన్‌చేస్తే.. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగలగొట్టిన యువకులు తయాజ్, రూపేష్, సైఫ్ పేర్లు నమోదు చేసుకుని, తాళాలు వేసి స్టేషన్‌కు రావాల్సిందిగా ఆదేశించారు. గురువారం బాధితులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని దౌర్జన్యానికి సంబంధించి ఫిర్యాదు చేశారు. సీఐ మహమ్మద్ రఫీ ఈ విషయమై మాట్లాడుతూ.. ఆస్తి వివాదం కోర్టులో నడుస్తుండగా తాళాలు పగలగొట్టడం నేరమని, అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాలతో లీగల్ ఒపీనియన్ తీసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.



రాత్రిపూట తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్న దుండగులు

అలుపెరుగని పోరాట యోధుడు కాన్షీరాం

మదనపల్లె రూరల్ : భారతదేశ రాజకీయ వ్యవస్థలో పెను భూకంపాన్ని సృష్టించి, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వానికి పునాది వేసిన పోరాట యోధుడు కాన్షీరాం అని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం.శివ ప్రసాద్ అన్నారు. గురువారం కాన్షీరాం 19వ వర్ధంతి సందర్భంగా స్థానిక బాస్, వీసీకే కార్యాలయంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీడిత జనుల విముక్తి కోసం డాక్టర్.బీఆర్.అంబేద్కర్ తుదిశ్వాస వరకు కృషిచేస్తే, ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకుని అంబేద్కర్ ఆశయాల సాధన కోసం జీవితకాలం పోరాడిన మహనీయుడు కాన్షీరాం అన్నారు. కార్యక్రమంలో వీసీకే, బాస్ నాయకులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, వై.గంగాధర్, సొన్నికంటి రెడ్డెప్ప, క్రాంతి, రవిశంకర్, విద్యార్థి నాయకులు పృథ్వీరాజ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం.శివప్రసాద్

బహుజన యువసేన ఆధ్వర్యంలో..

బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీతో జిల్లా ఎస్పీ భేటీ



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుతో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

మదనపల్లె రూరల్ : అన్నమయ్యజిల్లాకు విచ్చేసిన ఆర్టీసీ ఎండీ, మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావును, గురువారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డు వెన్నెల గార్డెన్స్‌లో భేటీ అయిన వారు ప్రజారవాణా భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ పోలీస్‌శాఖ సహకారంతో బస్సులు, బస్‌స్టేషన్‌లలో భద్రతను మరింత పెంచుతామని, ప్రజలు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు.

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ..

మదనపల్లె పర్యటనలో భాగంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.మహేంద్ర, సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెరుగుదలలో కార్మికుల భాగస్వామ్యం

ఎండీ సీహెచ్ ద్వారక తిరుమలరావు



రాజంపేట : ఉద్యోగుల అభినందన సభలో మాట్లాడుతున్న ఎండీ ద్వారకతిరుమలరావు

రాజంపేట : ఆర్టీసీ ఆదాయం పెరుగుదలలో కార్మికుల భాగస్వామ్యం తప్పనిసరి అని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారక తిరుమలరావు అన్నారు. గురువారం రాజంపేట డిపోలో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఆదాయానికి కార్మికులు కృషి చేయాలన్నారు. ఆర్టీసీ కార్మిక సంక్షేమానికి తన వంతుగా కృషిచేస్తానన్నారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రయాణికులతో స్నేహభావంతో మెలగాలన్నారు. సంయమనం పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు అప్పలరాజు, చంద్రశేఖర్, డీపీటీఓ రాము, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రాంనాథ్ హెగ్డే, డిపో అధికారి దాసరి కృష్ణమూర్తి, ఆర్టీసీ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు



బాధితురాలు నాగరత్నమ్మ

గుర్రంకొండ : ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మండలంలోని నడిమికండ్రిగ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గల్లా నాగరత్నమ్మ(73) భర్త రామయ్య పదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో నాగరత్నమ్మ అదే గ్రామంలోని తన కుమార్తె ఇంట్లో నివాసముంటోంది. ప్రతిరోజు గ్రామానికి సమీపంలోని శ్రీనివాస డాబా పక్కనే ఉన్న పాత ఇంట్లో పాడిఆవులకు నీరుతోడి పశుగ్రాసం వేసి గ్రామంలోకి వచ్చేది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం పాత ఇంటివద్ద పాడిఆవులకు నీరు పెడుతుండగా గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహనంలో అక్కడికి చేరుకొన్నారు. దాహంగా ఉందని మంచినీళ్లు కావాలని ఆమెను అడిగారు. నాగరత్నమ్మ నీళ్ల తేవడానికి ఇంట్లోకి వెళుతుండగా వెనుక వైపు నుంచి దుండగులు ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కొని ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్లిపోయారు. దీంతో మహిళ పెద్ద ఎత్తున కేకలు వేయగా గ్రామస్తులు అక్కడికి చేరుకుని వారి జాడకోసం గాలించారు. అయితే అప్పటికే దుండగులు గ్రామం వదిలి పరారయ్యారు. చోరీకి గురైన 30 గ్రాముల బంగారు గొలుసు విలువ రూ. 3 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. జరిగిన సంఘటనపై బాధితురాలు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురామ్ తెలిపారు.

దళితుడి భూమిపై కన్ను



వేడుకుంటున్న రైతు మల్లప్ప

ములకలచెరువు : దళితుల భూమి అక్రమంగా తెలుగుదేశం పార్టీ మాజీ నేత జయచంద్రారెడ్డి బామ్మర్ది గిరిధర్ రెడ్డి ఆక్రమించుకున్నాడని దళితుడు మల్లప్ప ఆరోపించాడు. వివరాలు...మండలంలోని పాత ములకలచెరువుకు చెందిన మల్లప్ప భూమికు సర్వే నెంబర్ 197 లో 8 ఎకరాల 54 సెంట్లకుగాను 1/4 వంతు మల్లప్ప తండ్రి రామప్పకు వర్తిస్తుంది. ఎస్సీ వర్గానికి చెందిన వీరి భూమిని తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీ బహిష్కృత నేత, కల్తీ లిక్కర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జయచంద్రా రెడ్డికి స్వయానా మేనల్లుడైన గిరిధర్ రెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకొని అధికారుల అండ దండలతో దొంగ పట్టా సృష్టించుకున్నాడని తెలిపాడు. దీనిపై పలుమార్లు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

భార్యను చంపిన కేసులో ఏడేళ్ల జైలు



పోలీసుల అదుపులో ఉన్న దోషి రౌతు బాబు

రాయచోటి టౌన్ : భార్యను చంపిన కేసులో భర్తకు ఏడేళ్ల జైలుతో పాటు రూ.1,70,000లు జరిమానా విధిస్తూ జిల్లా 7వ అదనపు న్యాయమూర్తి జి. ఎస్ రమేష్ కుమార్ తీర్పు చెప్పారు. రాయచోటి సబ్ డివిజన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె, కొండవాండ్లపల్లె గ్రామానికి చెందిన సావిత్రిని లక్కిరెడ్డిపల్లె మండలం వడ్డెపల్లె దిన్నెపల్లెకు చెందిన రౌతు బాబుకు ఇచ్చి వివాహం చేశారు. వివాహమైన కొద్ది సంవత్సరాలకే తమ కుమార్తెను అల్లుడు చంపాడని మృతురాలి తండ్రి 2021 సంవత్సరం సెప్టెంబర్ 9వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిపై గురువారం కోర్టులో వాదనలు విన్న న్యాయమూర్తి సెక్షన్ 498(ఏ), 304 (బి), 3అండ్4 డీపీ యాక్టు ప్రకారం దోషిగా నిర్ధారిస్తూ ఏడేళ్ల జైలు జీవితంతో పాటు రూ.1,70,000లు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును పర్యవేక్షించిన డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, సీఐ టీవీ కొండారెడ్డి, ఎస్ఐ డి. రవీంద్రబాబులను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అభినందించారు.